క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వెన్నెలగడ్డ, భజరంగ్ హిల్స్, భౌద్దనగర్, దుర్గా విహార్, వసంత విహార్, అరోమ్స్‌బర్గ్ కౌండిన్య అపార్ట్‌మెంట్స్, గణేష్‌నగర్, మహానగర్ ఎన్‌క్లేవ్, రుక్మిణి ఎన్‌క్లేవ్, జయరామ్‌నగర్, జెకే నగర్, కృష్ణనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కొన్ని రోజుల పాటు ఇబ్బందులు తప్పవని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం బుధవారం కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌లు హాజరు కానున్నారు. మున్సిపాలిటీకి చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొనాలని మున్సిపల్ చైర్మన్ కోరారు.

మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి



కార్పొరేటర్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ 1వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని కేఆర్‌సీఆర్ కాలనీలోని రోడ్డు నం.6 నివాసితులు కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ గల్లీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. రోడ్డుపైకి మురుగు వస్తుండటంతో పందులకు ఆవాసంగా మారిందన్నారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో డ్రైనేజీ లైన్‌కు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

మహిళ అదృశ్యం



రోజా(ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ వెంకన్న హిల్స్‌కు చెందిన దేవరాజు, రోజాలు భార్యాభర్తలు. కాగా ఈనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రోజా తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీ కట్ట మైసమ్మ ఆలయం వద్ద సంతోష్ రాజు, సంధ్యారాణి దంపతులు మంగళవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి శైలజారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆగస్టు వరకు ప్రతి నెలలో వచ్చే మంగళవారాల్లో అన్నదానం కోసం భక్తులు తమ తేదీలను ముందుగానే బుక్ చేసుకున్నారని ఆలయ కమిటీ వ్యవస్థాపకులు వివేక్‌రెడ్డి అన్నారు.

దివ్యాంగుడికి వాహనం అందజేత

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డాక్టోరల్ పరిశోధక విద్యార్థి హర్ష్‌రాజ్‌కు త్రీవీలర్‌ను మంగళవారం డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్(ఈసీడీఏపీ) ఎంపవర్డ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రామస్వామి అందించారు. ఈసీడీఏపీ అనేది హెచ్‌సీయూలో దివ్యాంగ విద్యార్థులు, సిబ్బంది యొక్క ప్రత్యేక అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన విభాగం. ఇప్పటికే మూడు చక్రాల స్కూటర్, బ్యాటరీ వీల్‌చైర్‌ను కొనుగోలు చేసింది. లోకో మోటర్ వైకల్యాలున్న విద్యార్థులకు అందజేస్తారు

అగ్నిప్రమాదాలు జరగకుండా

కట్టుదిట్టమైన చర్యలు

- పారిశ్రామిక ప్రాంతాల్లో అత్యున్నత అగ్నిమాపక పరికరాలు ఉంచాలి
- కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- జీడిమెట్ల ఫైర్‌స్టేషన్‌లో భద్రతా వారోత్సవాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద, అగ్నిమాపక సంస్థ డీజీ నాగిరెడ్డి

జీడిమెట్ల: ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు వారి సంస్థల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం జీడిమెట్లలోని ఫైర్‌స్టేషన్‌లో నిర్వహించిన భద్రతావారోత్సవాల కార్యక్రమానికి ఆయన స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతమైన జీడిమెట్లలో అత్యున్నత అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ప్రైవేట్ సంస్థలకు అనుమతులు ఇచ్చే క్రమంలో ఆన్‌లైన్ పద్ధతిలో పరిశ్రమలు, షాపింగ్‌మాల్స్, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఎస్ లక్ష్మీప్రసాద్, ఏడీఎఫ్ఎస్ నారాయణరావు, ఆర్ఎఫ్‌వో పాపయ్య, డీఎఫ్ఓలు సుధాకర్‌రావు, మధుసూధన్‌రావు, ఏడీఎఫ్ఓలు కేవీ సతీష్‌కుమార్, వై.సైదులు, ధనుంజయ్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, జీవి ప్రసాద్, జీడిమెట్ల, షామీర్‌పేట, కూకట్‌పల్లిలకు చెందిన ఎస్ఎఫ్ఓలు, సిబ్బంది వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ **ప్రాణ, ఆస్తి నష్టం నుంచి కాపాడే యోధులు ఫైర్ సిబ్బంది..**

ప్రపంచంలో రియల్ ఫైట్ చేసే వీరులు ఎవరంటే ఆర్మీ, ఫైర్ సిబ్బందేనని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. అగ్ని శిలలు ఎగిసిపడుతున్నా, శ్వాసతీసుకోనివ్వకుండా పొగలు వెలువడుతున్నా ముందుకు దూసుకువెళ్లి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడే యోధులు ఫైర్ సిబ్బందేనని ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన కొత్త ఫైర్‌స్టేషన్‌లను ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని అన్నారు.

◆ **అగ్నిప్రమాదానికి కారణమయ్యే కారకాలపై అవగాహన ఉండాలి**

ముఖ్యంగా అగ్నిప్రమాదానికి కారకాలు ఎలక్ట్రికల్ వైర్లు, ప్యానల్‌బోర్డులు, రసాయనాలు, ఇంధనాలు కావున వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర అగ్నిమాపక సంస్థ డీజీ నాగిరెడ్డి అన్నారు. ఎల్లప్పుడు ఇళ్లల్లో, సంస్థల్లో ప్యానల్‌బోర్డ్స్, పాత ఎలక్ట్రికల్ వైర్లను ఎప్పటికప్పుడు పరీక్షించాలి. మండే స్వభావం కలిగిన రసాయనాలను భద్రపరిచే క్రమంలో తగిన చర్యలు తీసుకోవాలి.

◆ **50మంది రక్తదానం**

భద్రతా వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. 50మంది ఫైర్ సిబ్బంది రక్తదాన కార్యక్రమంలో పాల్గొని 50యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు.



అగ్నిమాసక పరికరాలను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద



రక్తదానం చేసేవారితో మాట్లాడుతున్న మంత్రి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

సూపర్‌మ్యాక్స్ కార్మికులకు న్యాయం చేస్తాం: మంత్రి

జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు అన్యాయం జరగకుండా చూస్తానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. జీడిమెట్లలోని సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ జీతాలు చెల్లించకుండా పరిశ్రమను మూసివేసింది. దీంతో 51రోజులుగా కార్మికులు పరిశ్రమ ఎదుట రిలే నిరాహారదీక్ష నిర్వహిస్తున్నారు. మంగళవారం కార్మికశాఖమంత్రి మల్లారెడ్డి ఎమ్మెల్యే వివేకానందతో కలిసి దీక్షాశిబిరం వద్ద కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. అనంతరం పరిశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులతో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కార్మికులకు రావాల్సిన గ్రాంట్స్‌ను ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క కార్మికునికి సైతం అన్యాయం జరగనివ్వనని ఆయన అన్నారు.

యాజమాన్యం మెడలు వంచుతా..

10 నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకుండా వారికి అన్యాయం చేసిన పరిశ్రమ యాజమాన్యం తేలుస్తానని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడ్డా పరిశ్రమ యాజమాన్యానికి కొంతైన చీమ కుట్టినట్లు లేదని అన్నారు. అవసరమైతే న్యాయపరంగా కోట్లాడి యాజమాన్యం మెడలు వంచి కార్మికులకు న్యాయం చేస్తానని మల్లారెడ్డి హామీ ఇచ్చారు. మీటింగ్‌లో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, హెచ్ఎంఎస్ యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్‌కేవీ యూనియన్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి, సీఐటీయూ ప్రెసిడెంట్ మల్లికార్జున్, జేసీఎల్ చతుర్వేది, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత హామీలతో తెలంగాణ ప్రజలు విసుగు చెందారని... ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని మూడు గుళ్ల పరిధిలో మంగళవారం ఆయన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రను నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు.

◆ ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో పేద ప్రజలు సొంతింటికి నోచుకోలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థలం ఉన్న ప్రతి పేదవాడికి రూ.5 లక్షల రుణం ఇస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, అమలు పరిచిన సంక్షేమ పథకాలను చూసి తమను బలపరచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమర్, కాంగ్రెస్ నాయకులు బేకు శ్రీనివాస్, నర్సింగ్, మధుసూదన్‌రెడ్డి, శివరెడ్డి, కిరణ్, మోహన్ రాజు , నర్సింహ, గురుమూర్తి, రాహుల్, పల్లవి, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని సంతకాల సేకరణ

కుత్బుల్లాపూర్: జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జీడిమెట్ల ప్రెస్‌క్లబ్ ఆవరణలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఎస్‌కే సలీమా, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం టీడబ్ల్యూజేఎఫ్ కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధన కోసం ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు. మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, మండపాక కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ... జర్నలిస్టుల ఇళ్ల సాధన కోసం చేపట్టనున్న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శులు యాట రాజు, రమేష్, కావలి మోహన్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు గడ్డమీది అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గారావు, వీరేష్ ముదిరాజ్, నాగరాజు, డప్పు రామస్వామి, శంకర్, నామా మోహన్, నగేష్, బొల్లమల్ల నర్సింగ్‌రావు, కొండ సంజీవ, అంజి గౌడ్, దీపక్, గోవిందరావు,మంజుల, సౌభాగ్యవతి, లక్ష్మీ, దివాకర్, జి. ఆంజనేయులు, మెరుగు విష్ణు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది'



అక్సా మసీద్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న గోపాల్‌రెడ్డి

నిజాంపేట్: బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి కట్టుబడి ఉందని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లో నూతనంగా నిర్మించిన అక్సా మసీద్‌ను మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం డివిజన్ మైనార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ.. ముస్లిం యువతుల వివాహాలకు షాదీముబారక్, బ్యాంక్ రుణాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని పండుగను సంతోషంగా జరుపుకునేందుకు రంజాన్ తోఫాను సైతం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీమ్, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగారాయ ప్రసాద్, వెస్ ప్రెసిడెంట్ పద్మ ప్రసాద్, ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఖాన్ సాబ్, 12వ డివిజన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ముస్లింలు ఎండీ మున్నా, ఉస్మాన్, బుర్హాన్, ఎండీ ఇస్మాయిల్, మెహబూబ్, ఇస్మాయిల్, చోటు, ఫైజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదానం చేయడం సంతోషంగా ఉంది'



చిన్నారులతో ఫౌండేషన్ సభ్యులు

దుండిగల్: ఒక్కరోజు అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని విప్లవ జ్యోతి అల్లూరి ఫౌండేషన్ సభ్యుడు తరుణ్ అన్నారు. మంగళవారం తరుణ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి దుండిగల్‌లో ఉన్న స్ఫూర్తి ఫౌండేషన్ చిన్నారులకు, గండిమైసమ్మలోని పల్లవి అనాథాశ్రమంలో మానసిక వికలాంగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు జంగా తాతాజీ, బాబాయ్, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో షెడ్‌ను నిర్మిస్తాం



ఈద్గాను సందర్శిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: రంజాన్‌లోపు ఈద్గా వద్ద ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా షెడ్‌ను నిర్మిస్తామని కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఈద్గాను సందర్శించారు. బస్తీలోని బీఆర్ఎస్ నాయకుడు ఇమామొద్దీన్ కూతురు మృతిచెందగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు అక్రమ్, హాజీ, రషీద్, జాకీర్, ఖాదర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో బుధవారం ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ గార్డెన్‌లో సాయంత్రం 6 గంటలకు ఇఫ్తార్ ప్రారంభమవుతుంది.

కూల్చడమేనా.. నిర్మించరా.!



బస్‌షెల్టర్‌ను కూల్చివేయడంతో పైకప్పుగా దేరా వేసిన దృశ్యం, ఎండలో ప్రయణికురాలు

రంగారెడ్డినగర్: నిక్షేపంగా ఉన్న బస్‌షెల్టర్‌ను కూల్చివేయడంతో ఎండలో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట- ఐడీపీఎల్ రోడ్డులో ఉన్న గాంధీనగర్ బస్‌షెల్టర్‌ను రెండు నెలల క్రితం అధికారులు తొలగించారు. అయితే కొత్త షెల్టర్‌ను ఏర్పాటు చేస్తారనుకుంటే ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో స్థానికులే కూల్చివేసిన షెల్టర్ ప్రాంతంలో నీడనిచ్చేందుకు బట్టలతో తాత్కాలికంగా షెల్టర్ ఏర్పాటు చేశారు. అయితే వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రతను షెల్టర్‌లో నిలుచునే ప్రయాణికులు తట్టుకోలేకపోతున్నారు. ఇక కొందరైతే ఎండలోనే బస్సుల కోసం నిలుచుంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



డీజీఎం సరితకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్: వేసవి నీటి ఎద్దడితో నిజాంపేట్ కార్పొరేషన్ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంళవారం సీపీఐ ఆధ్వర్యంలో జలమండలి డీజీఎం సరితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్తీలలో తాగునీటి సరఫరా సక్రమంగా చేయడం లేదన్నారు. కనీసం వాటర్ ట్యాంకర్‌ను సైతం పంపడం లేదన్నారు. ఇంద్రన్నకాలనీలో మంజీర గేట్‌వాల్వ్ గత 6 నెలలుగా మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. మిషన్ భగీరథలో భాగంగా వేసిన పైపులైన్లను సరైన పద్ధతిలో వేయలేదని తెలిపారు. 6 ఇంచ్‌లు వేయాల్సిన పైపులైన్‌ను 4 ఇంచ్‌లే వేశారని పేర్కొన్నారు. పనుల్లో అవకతవకల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటా

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్‌నగర్ కాలనీ ఫేజ్-1, 2లలో అయన మాజీ కార్పొరేటర్ గౌరీష్‌తో కలిసి ప్రగతియాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అభివృద్ధి పనులకు నిధులు లేమి లేకుండా అన్ని ప్రాంతాల్లో చేపడుతున్నామని అన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్‌చారి, బాలయ్య తదితరులు ఉన్నారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ ఆయా విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో రూ.84 కోట్లు, జీహెచ్ఎంసీ పరిధిలో రూ.95 కోట్లతో నాలా నిర్మాణాలతో పాటు భూగర్భ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. పనుల పురోగతిపై ఎమ్మెల్యే ఆరా తీయగా దాదాపు 85% పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వర్షాకాలం లోపు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిధుల విడుదలలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ ఆనంద్, ఈఈలు నారాయణ, కృష్ణ చైతన్య, డీఈఈలు నరేందర్, నళిని, ఏఈలు రామారావు, నాగరాజు, లక్ష్మీనారాయణ, కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కార్పొరేటర్లు రవికిరణ్, సురేష్‌రెడ్డి, ఆగం రాజు, ఆగం పాండు ముదిరాజ్, కాసాని సుధాకర్, జ్యోతి, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు హారతులు పడుతున్న మహిళలు